# నాన్నను చూడాలి

"అవంతీ. లే. ముఖంకడుక్కుని స్నానంచేసి ఉతికినగౌను వేసుకో. నీవు తలదువ్వుకుని పాలుతాగి సిద్ధంగా ఉంటే నీకు నాన్నను చూపిస్తాను" అంది నాగమణి.

దిగ్గున లేచి కూర్చుంది అవంతి.

"ఏడీ నాన్న? ఎక్కడున్నాడు ?"

"నాన్న ఇక్కడలేరు. మనం వెళ్ళి చూద్దాం".

తల్లి మాటలకు ఎక్కడలేని ఉత్సాహం వచ్చింది అవంతికి. లేచి ముఖం కడుక్కుంది. వేడివేడినీళ్ల స్నానం చేసింది. తల్లిచేత తలదువ్వించుకుని రిబ్బన్లు సరిగా కట్టిందో లేదోనని అద్దంలో చూసుకుంది. ఆమె ఉత్సాహం అంతటితో ఆగలేదు తాతగారి గదిలోకి పరుగెత్తుకుంటూ వెళ్ళింది.

తాతగారికి రాత్రిళ్లు సరిగా నిద్రపట్టదు. తెల్లవారుఝామునుంచీ మేలుకునే ఉంటారు. మంచమ్మీద లేచి కూర్చుని నరసింహశతకం, దాశరధీశతకాలు చదువుకుంటారు. అవన్నీ ఆయనకు కంఠతః వచ్చు.

"తాతయ్యా. నేను నాన్నను చూడటానికి వెళ్తున్నాను".

తాతగారికి కళ్ళుమూసుకుని చదువుతున్న పద్యాల ధోరణిలో అవంతి మాటలు సరిగా వినబడలేదు.

"తాతయ్యా" అంది మళ్ళీ బిగ్గరగా.

"ఏమిటమ్మా? ఇంత చీకటిలో లేచావెందుకు? ఎక్కడికి వెళ్తావుః"ఆమెను దగ్గర కూర్చోబెట్టుకుని అడిగాడు.

"అయ్యో-తాతయ్యా? నేను చెప్పినప్పుడు వినలేదు. నాన్నను చూడటానికి వెళ్తున్నాను. వినబడిందా?" గట్టిగా అరిచినట్లు చెప్పింది.

"నాన్నను చూడటానికా? ఎక్కడున్నాడని వెళ్తావు?" అన్నాడు. ఆయనకు ఒక్కడే కొడుకు. బి. ఏ. చదువుకున్నాడు కాని ఉద్యోగం లేదు. అయినా ఎప్పుడూ పదిమందిని వెంటబెట్టుకుని తిరుగుతూ ఉంటాడు. ఊళ్ళో ఉండటం తక్కువ. ఎప్పుడూ మీటింగులంటూ హడావిడిగా తిరుగుతాడు. తనకు ఆరోగ్యం బాగా ఉన్నంతవరకూ వ్యవసాయం పనులు చూసుకునేవాడు. ఇప్పుడు ఆ పనులన్నీ తల్లికి ఒప్పచెప్పి జాతీయోద్యమమంటూ డబ్బు ఖర్చుచేస్తున్నాడు. వేళకు అన్నం నీళ్ళు లేవు.

"నాన్నా. ఎట్లా ఉన్నావు? నేను మద్రాసు వెళ్ళాలి. మనవాళ్ళంతా అక్కడ సభలు చేస్తున్నారు. గాంధీగారు, పటేల్ గారు, ప్రకాశం, పట్టాభి, సాంబమూర్తి గార్లు వస్తున్నారు."

"మళ్ళీ ఎప్పుడొస్తావు ? కొంచెం తీరిక చేసుకుని ఇంటిసంగతి చూస్తూ ఉండు. వ్యవసాయాన్ని రైతులకొప్పచెప్పావు. అమ్మ చెప్పగలదు. కాని దగ్గరుండి చేయింపలేదు కదా."

"నాన్నా. నీకంతా తెలుసు. మన దేశంకోసం తిరుగుతున్నాను. నేను ఒక్కడినే కాదు. వేలాదిమంది గాంధీగారి ఉద్యమములో పనిచేస్తున్నారు. మన దేశాన్ని కొల్లగొట్టి మనను బానిసలుగా చూస్తున్న తెల్లవారిని ఈ దేశాన్నుంచి వెళ్ళగొట్టటానికి ప్రయత్నాలు చేస్తున్నాం. నీకు పాటలు వినబడటంలేదూ ? 'మాకొద్దీ తెల్లదొరతనము"ని పాడుతూ ఊరేగింపులు జరుగుతున్నాయి? ఇంటింటా రాట్నం చేసే చప్పుడు వినబడటంలేదూ? విదేశీ వస్తువులను కొనవద్దనీ, మన దేశంలో ఉత్పత్తి అయ్యే సరుకులే కొనమనీ వీధివీధికీ ఉద్యమ సేవకులు తిరుగుతున్నారు చూడటంలేదూ? అందరూ ఖద్దరు వస్త్రాలే ధరించాలని గాంధీగారు అంటున్న మాటలు పత్రికలలో చదవటంలేదూ?" అన్నాడు ఆవేశంతో.

"వింటున్నానురా, వింటున్నాను. చూస్తున్నాను. చదువుతున్నాను. నీవంటి చదువుకున్న యువకులు ఇళ్ళనూ, సంసారాలనూ వదిలిపెట్టి జాతీయోద్యమమంటూ తిరగటమూ చూస్తున్నానురా. దమ్మిడీ సంపాదన లేదుగాని. తాతలు సంపాదించిన ఆస్తులు కరగ పెట్టటమూ చూస్తున్నాను. ఇదొక కాలం! ఇది ఎంత కాలం నడుస్తుందో ఇలా? మావంటి పెద్దవాళ్ల గతి ఏమిటో? సరే వెళ్లు నీవన్నట్టు

వేలాదిమంది కలిసి పనిచేస్తుంటే ఏనాటికయినా మీ కష్టం ఫలించకుండా ఉంటుందా ? సరే కానీ" కళ్ళు వొత్తుకున్నాడు భుజమ్మీది తువాలతో.

నిలబడ్డ గోపాలకృష్ణ తండ్రి మంచమ్మీద కూర్చుని "నాన్నా! నీకు అన్ని సంగతులూ తెలుసు. మనదేశపు స్థితిగతులూ తెలుసు. తెల్లవారి మోసాలూ తెలుసు. మన నాయకులు చేస్తున్న కృషీ తెలుసు. ఈ ఉద్యమంలో మావంటి యువకులు పనిచేయకపోతే ఎవరు చేస్తారు చెప్పు? గాంధీగారు మద్రాసు రమ్మ న్నారు వెళ్తున్నా. ఇంటిసంగతులు నాగమణి చూసుకుంటుంది. మన సాంబయ్యా వ్యవసాయం చూస్తాడు. నీకేమందు కావాలన్నా మన ఆచార్యులు తెచ్చియిస్తాడు. మీరంతా ధైర్యంగా ఉండాలి. నేను వస్తూఉంటాను. దిగులు పెట్టుకోకండినాన్నా నాకు ధైర్యం చెప్పండి" ఆయనకు దగ్గరగా కూర్చున్నాడు.- భుజాలమీద చేతులు వేశాడు. ఒళ్ళంతా నిమరాడు. తండ్రినెంతో మెచ్చుకున్నాడు.

ఆయన తన తండ్రి. తను ఏకైక సంతానం. రోజూ కంటికి కనబడక పోతే ఆయనకు బాధ. భోజనం సరిగా చెయ్యడు.

అట్లా అప్పుడు వెళ్ళిన గోపాలకృష్ణ ఉప్పుసత్యాగ్రహోద్యమంలో అంద రితోపాటు సముద్రపుటొడ్డున ఉప్పు తయారుచేస్తూ అరెస్టయినాడు. ఏడాదికి పైగా అయింది.

ఎవరో వచ్చి చెప్పారు నాగమణికి-

రాజమండ్రిజైలులో ఉన్న గోపాలకృష్ణనూ ఆయనతో ఉప్పుసత్యాగ్రహం చేసినవాళ్ళను వేసలో తీసుకువచ్చి వదిలిపెడుతున్నారని పత్రికలో వచ్చిందని.

నాగమణి అవంతినీ, పిల్లవాడినీ తీసుకువెళ్ళి తండ్రిని చూపించాలని, అవం తికి స్నానంచేయించి తనూ చేసింది. పిల్లలకు పాలుతాగించి సూర్యోదయం కాక ముందు బయలుదేరింది.

"అమ్మాయీ! పిల్లలను తీసుకువెళ్తున్నావు నీవు వట్టిమనిషివికావు జాగ్రత్త. ఆరుమైళ్ళు నడవాలి" అంది అత్తగారు.

"జాగ్రత్తగా వెళ్తాలెండి" అని అవంతి చెయ్యి పట్టుకుని పిల్లవాడిని యెత్తు కుని బయలుదేరింది.

"ఇక్కడికి రెండుమైళ్ళ పైన నడిచాం. ఇంకా మూడుమైళ్ళ పైన నడవాలి" అన్నది నాగమణి.

అవంతి ముఖం వేలాడిపోయింది. ఆ చిన్ని వయసులో నాన్నను చూడాలన్న ఆతురతతో అడుగులు వేస్తున్నది. దారిలో ఒక మనిషి అవంతిని, ఆమె పడుతున్న బాధనూ చూసి కొంతదూరం ఎత్తుకుని నడిచాడు.

"గంట ఎంతయ్యా?" దారినపోయే ఆయన చేతికి గడియారం ఉండగా చూసి అడిగింది నాగమణి.

"ఎనిమిది గంటలు దాటాయి" అన్నాడు.

"అమ్మో అప్పుడే ఎనిమిది దాటింది. అవంతీ, నడవగలవా? తొమ్మిది గంటలకు మనమక్కడ ఉండాలి. జనం పోగవుతారు. మనం ముందుగా వెళ్ళాలి. కాళ్ళు నొప్పులు పెడుతున్నాయా? నాన్నను చూడాలంటే నడవాలి మరి" అన్నది అవంతిని చూసి ఉత్సాహపరుస్తూ.

"నడుస్తున్నానమ్మా" మాటలో నీరసం కనబడుతోంది. పరుగెత్తుకుంటూ వెళ్ళి ఒకచోట కూర్చుంటోంది. నాన్న వస్తున్నాడు! ఎండకు వాడిన ముఖంలో నాన్నను చూస్తానన్న సంతోషం ఒక్క వెలుగులా కనబడుతోంది.

ఆగకుండా నాగమణి నడుస్తున్నది. వేగంగా పిల్లవాడినెత్తుకుని నడుస్తున్నది. కాళ్లు మొదట నడిచినట్లుగా లేవు. బలవంతంగా కాళ్ళను ఈడ్చుకుంటూ నడుస్తున్నది.

అయినా దగ్గరకొచ్చినట్టే.

"అమ్మా! మంచినీళ్లు కావాలమ్మా!" అవంతిఏడుపు. ఆ ఏడుపు నడవలేక. అయినా తండ్రిని చూడాలన్న ఆశ.

మంచినీళ్లు తాగి, దగ్గరకొచ్చామని తల్లి అన్న మాటలకు గబగబా మళ్ళీ నడక సాగించింది.

ఒక పావుమైలు దూరం ఉందనగా జనం ఒకటే పరుగులెత్తుతున్నారు గుంపులు గుంపులుగా.

"అక్కడికే కాబోలు" అనుకుంది నాగమణి. ఆ గుంపులో తనూ పిల్ల చెయ్యి పట్టుకుని కలిసిపోయింది.

"రాజమండ్రి జైలునుంచి మన రాజకీయ ఖైదీలను వేన్‌లో తీసుకువచ్చి వదిలిపెడతారట! వాళ్లందరినీ చూడటానికి జనం గుంపులు గుంపులుగా ఊళ్ళ నుంచి వస్తున్నారు". జనం వేన్ ఆగేచోట గుమిగూడారు.

తను అవంతితో ఎంత తొందరగావచ్చి నిల్చుందామన్నా తోసేస్తున్నారు. తను అతడిని చూడగలదో లేదో? ఎట్లా ఉన్నాడో? పొద్దునలేవగానే తను చిక్కటి కాఫీ ఇచ్చేది అట్లా ఇస్తారా జైల్లో?

తనకంటె ముందుగా అవంతికి తండ్రిని చూపించాలి. ఎట్లాగయినా జనంలో దూరి, అవంతికి చూపించి తన అత్తమామలు బాగున్నారని అయనకు చెప్పాలి. ఇంటికి వెళ్ళినతరువాత మెల్లగా తన సంగతి వివరంగా చెప్పాలి.

అంతలో "అదిగో వేన్ వస్తోంది" అన్న కేకలు - జనం పరుగెత్తటాలూ- వేన్ ఆగగానే నాలుగుపక్కలా చుట్టేశారు జనం. ఆ పరుగులలో అవంతి కింద పడిపోయింది. నాగమణి అవంతీ, అని అరుస్తోంది ఆదుర్దాతో.

ఆమె వేన్‌దగ్గరికి వెళ్ళలేకపోయింది. కాని అతడికొరకు వెయ్యికళ్ల చేసుకుని చూసే చూపులతో వెతికింది. చివరకు ఆమె భర్తను చూడగలిగింది దూరం నుంచే. అతడూ ఆమెను చూశాడు. "దిగండి" అని కేకపెట్టింది. "అవంతీ. అవంతీ. నాన్ననుచూడు" అని పిలుస్తోంది.

అంతలో మరొకజీపు. పోలీసువేన్ వచ్చాయి. పోలీసుఅధికారి ఒక కాగితం చేతపట్టుకుని వేన్‌దగ్గరకొచ్చి మిమ్మల్నందరినీ యర్రవాడ జైలుకు మరొక రెండుసంవత్సరాలు పంపుతున్నాం" అంటూ పోలీసులకు చెప్పాడు- వీళ్లందరినీ ఆ వేనులోకి జాగ్రత్తగా ఎక్కించి తీసుకువెళ్ళండి'' అని

ఈ వేన్ దిగి ఆ వేన్ ఎక్కేటప్పుడు ఒక్కసారి పిల్లలనూ, నాగమణిని పలకరించి ఎట్లా ఉన్నారని అడగాలనుకున్నాడు అతడు.

ఇటూ అటూ చూశాడు. వ్యవధిలేదు వెతకటానికి. పోలీసులు ఎంత అట కాయించినా జనం ఆగటంలేదు. అతడికి నాగమణి మళ్ళీ కనబడలేదు. అవంతిని

అతడు అసలే చూడలేదు. అవంతిని- రోజూ కలలో కనబడే అవంతిని చూసి నాన్న ముద్దుఇవ్వాలనుకున్నాడు.

నాగమణి భర్త వెళుతుండగా చూసింది కాని సమీపించే అవకాశం లేదు.

పోలీసు అధికారి "పోనివ్వు"అని డ్రైవర్‌కి ఒక కేక పెట్టి కర్రతో చూపించాడు బయలుదేరమని.

జనం తప్పుకున్నారు. వేన్ కదిలి వెళ్ళిపోయింది. జనం ఎట్లా వచ్చారో అట్లా వెళ్ళిపోతున్నారు. నాగమణి అవంతికోసం వెతుకుతోంది. ఇంతదూరం నడిచి వచ్చిన ఆ పసికాళ్లు ఎంత నొప్పి పెట్టాయో? కాని తండ్రిని చూడలేకపోయింది. ఇంకా ఏం చూడగలుగుతుంది? వేన్ వెళ్ళిపోయింది. ఇంటికి వెళ్ళిన తరువాత తండ్రి కబుర్లు ఏవో నాలుగు కల్పించి చెప్పాలి అవంతికి.

పల్చబడుతున్న ఆ గుంపులో అవంతీ అని పిలుస్తూ వెతకటం మొదలు పెట్టింది. "ఎవరైనా చూశారా మా ఆరేళ్ళ అవంతిని?" అడుగుతూ వెతుకుతోంది. జనమంతా వెళ్ళిపోయినతరువాత- ఆ జనంలో - ఆ తొక్కిసలాటలోఅవంతి చితికిపోయినట్లయింది. ఎవరో కాళ్ళకు అడ్డంరాకుండాఅమ్మాయిని గోడపక్కకునెట్టారు.

"అక్కడ ఒక చిన్నపిల్లను గోడపక్కకు నెట్టారు. వెళ్ళి చూడండి" అన్నారెవరో.

నాగమణి గబగబా అడుగులువేస్తూ వెళ్లేసరికి అవంతి దేహం ఎందరి పాదాల క్రిందనో పడి నుగ్గునుగ్గు అయినట్టుగా ఉంది. ఒంటినిండా దుమ్ము- ఒక చెత్త కుప్ప పక్కన పడివుంది అవంతి దేహం.

ఆమెను ఒళ్ళో పడుకోబెట్టుకుని "అవంతీ, నాన్నకోసం ఇంతదూరం నడిచి వచ్చి ప్రాణాలు పోగొట్టుకున్నావా తల్లీ? నాన్నను చూశావా? నాన్నకోసం కలవరించిపోయావు. అమ్మా నీవులేకుండా నేనెట్లా ఇంటికి వెళ్ళను? మీ తాతా-బామ్మలకు ఏమని చెప్పను?" నాగమణి ఏడుపును అక్కడ పోగయిన జనం చూడలేకపోయారు. ఆమెను ఓదార్చటానికి వాళ్ళకు సాధ్యం కావటంలేదు.

ఆ గుంపులో ఎవరో గ్లాసెడు పాలు తీసుకువచ్చి ఏడ్చేపిల్లవాడికి పట్టారు. నాగమణి గొంతు ఎండిపోకుండా మంచినీళ్ళు గొంతులో పోశారు

"మీ యిల్లెక్కడ చెప్పమ్మా. నీవు ఎక్కడినుంచి వచ్చావు? నిన్నక్కడ దిగపెట్టి వస్తా"మన్నారు. ఇద్దరు ఆడవాళ్లు మగవాళ్ళూ.

"నా అవంతి లేకుండా నేను ఇంటికి ఎట్లారాను?" ఏడ్చింది నాగమణి.

"ఈ అమ్మాయిని భుజానవేసుకుని నేను మీయింటివరకూ వస్తాను. మీ బాబును యెత్తుకుని మా అమ్మ వస్తుంది. మీరు దారిచూపించండి" అంటూ ఆమెను లేవదీసి, అవంతిని భుజాన వేసుకుని అతడు బయలుదేరాడు. అతడివెంబడి పిల్ల వాడిని ఎత్తుకుని నాగమణి చెయ్యి పట్టుకుని అతడి తల్లి నడిచి వెళ్ళింది.

దారిపొడుగునా నాగమణి వెక్కివెక్కి ఏడుస్తూ 'నా తల్లి తండ్రిని చూడాలని అక్కడక్కడ కూర్చుంటూ లేచి పరుగెత్తుతూ నడిచిందయ్యా మా అవంతి" అడుగులువేస్తూ ఇంటిదారి పట్టింది నాగమణి.

ఇలా ఎందరో తండ్రులను చూడలేని పిల్లలూ, భర్తలను చూడలేని భార్యలూ, కొడుకులను చూడలేని తల్లిదండ్రులూ అలమటించి, ఆస్తులు పోగొట్టుకుని, ఇళ్లు వేలంవేయబడి నానా అగచాట్లు పడగా వచ్చిన స్వాతంత్ర్యం మనది. దెబ్బలుతిని, నడుములు విరగగొట్టించుకుని, ఆహారం సరిగాలేక రోగాలతో జైలులో మరణించినవారు, ఇళ్లకువచ్చి మరణించినవారూ ఎందరో. వారంతా ఏదో వారి స్మృతులు తప్ప? వారిలో అవంతి అణువులో అణువు. అయినా ఆ తల్లికి కడుపుకోత. అట్లా ఎందరెందరో? అయినా ఎవరి దుఃఖం వారిది.